సాక్షి నంద్యాల

ఆదివారం । 1 । డిసెంబర్ । 2024



నిశ్శబ్దాన్ని ఛేదించారు..!

కొన్నేళ్లుగా ఎయిడ్స్ తగ్గుముఖం పడుతోంది. న్యాకో హెచ్‌ఐవీ సెంటినెల్ సర్వైలెన్స్ సర్వే ప్రకారం జిల్లాలో 2002లో 0.50 శాతం ఉన్న హెచ్‌ఐవీ వ్యాప్తి 2024 నాటికి 0.47 శాతంగా ఉంది.



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: నిత్యకళా వేదికపై శనివారం హైదరాబాద్ విశ్వశాంతి బృందం ప్రదర్శించిన సంప్రదాయ నృత్యప్రదర్శన భక్తులను అలరించింది. పలు భక్తి గీతాలకు నృత్యం చేశారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,629.78
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 93.060
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 2,860
అవుట్ ఫ్లో	: 6,441

న్యూస్‌రీల్

మద్దిలేటయ్య ఒక్క రోజు ఆదాయం రూ. 3,24,427

బేతంచెర్ల: శ్రీలక్ష్మీ మద్దిలేటి నరసింహస్వామికి శనివారం ఒక్కరోజే వివిధ సేవల ద్వారా రూ. 3,24,427 ఆదాయం వచ్చింది. కార్తీక మాసం కడ శనివారాన్ని పురస్కరించుకుని స్వామి దర్శనార్థం భక్తులు తరలివచ్చారు.వీరు ఉదయం స్వామి, అమ్మవార్లకు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేయడంతో పాటు గండా దీపాలు మోసి మొక్కులు చెల్లించినట్లు అసిస్టెంట్ కమిషనర్, ఈఓ రామాంజనేయులు తెలిపారు. ఆలయ సందర్శనకు వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు నామధారణతో పాటు తీర్థ ప్రసాద వితరణ చేశారు.

కామేశ్వరీదేవికి స్వర్ణ కంఠాభరణం



ఈఓకు కంఠాభరణం అందిస్తున్న పండితులు, కుటుంబ సభ్యులు

మహానంది: మహానందిలో కొలువైన కామేశ్వరీదేవి అమ్మవారికి ఆలయంలో పని చేస్తున్న వేదపండితులు నాగేశ్వరశర్మ, శాంతా రాంభట్, శ్రీశైలం దేవస్థానం వేదపండితులు జ్యోతి స్వరూప్ దంపతులు శనివారం 41 గ్రాములు స్వర్ణ కంఠాభరణం విరాళంగా ఇచ్చారు. వీరిని ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి, ఏఈఓ ఎరమల మధు, ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి అభినందించారు.

పారదర్శకంగా ప్రత్యేక ఓటరు జాబితా



మాట్లాడుతున్న జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ కన్నబాబు

నంద్యాల: ప్రత్యేక ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించాలని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి కన్నబాబు ఈఆర్వోలు, ఏఈఆర్వోలను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ రాజకుమారి, జేసీ విష్ణుచరణ్‌లతో కలిసి ఆయన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం -2025పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ స్వీకరించిన క్లైమ్‌లు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా విచారించి ఓటర్ల జాబితాలో పొందుపరచాలన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు ఏవైనా ఫిర్యాదులుంటే ముందుగానే అందించాలన్నారు. ఫామ్-7 దరఖాస్తులను కమిషన్ నిబంధనలు పాటించి తొలగించాలన్నారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో 13,90,225 మంది ఓటర్లు ఉన్నారని, ఫామ్-6, ఫామ్-7, ఫామ్-8కు సంబంధించి 5,326 క్లెయిమ్స్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. తప్పులు లేని ఓటర్ల జాబితా తయారు చేసేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు సహకారం అందించాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ రాము నాయక్, వైఎస్సార్‌సీపీ నుంచి సాయిరాం రెడ్డి, టీడీపీ నుంచి ప్రసాద్ రెడ్డి, సీపీఎం నుంచి లక్ష్మణ్, సమాజ్‌వాది పార్టీ నుంచి శ్రీనివాసులు, కాంగ్రెస్ నుంచి రియాజ్ బాషా, బీజేపీ నుంచి చంద్రశేఖర్, బీఎస్పీ నుంచి శ్రీనివాసులు పాల్గొన్నారు.

పసి ప్రాయం.. విధి గాయం!



➤ తల్లి అనారోగ్యం, తండ్రి మద్యానికి బానిస కావడంతో ఈ చిత్రంలోని గూడురుకు చెందిన నలుగురు చిన్నారులు రోడ్డున పడ్డారు. ఈ ఏడాది మార్చి నెలలో ఈ చిన్నారులు స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పరిసరాల్లో భిక్షాటన చేస్తున్న విషయాన్ని గుర్తించిన అధికారులు చేరదీశారు. ప్రస్తుతం పెద్దమ్మాయి మల్లిక పెద్దపాడులోని దామోదరం సంజీవయ్య బాలసదనంలో ఉంటూ నాల్గవ తరగతి చదువుతోంది. ఇద్దరు బాలురు (తిమ్మప్ప, సాయి) స్థానిక పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని విజ్ఞాన పీఠంలో చదువుకుంటున్నారు. మరో చిన్నారి మారెమ్మ సీ క్యాంప్‌లోని శిశు గృహలో ఉంటోంది.





భూమిక, సంజన

➤ స్థానిక బంగారుపేటకు చెందిన భూమిక, సంజన, హేమ అనే చిన్నారులతో పాటు నగరంలోని కేసీ కెనాల్ పరిసరాలకు చెందిన అంజలి నగరంలోని పలు ప్రాంతాల్లో భిక్షాటన చేస్తుంటే అధికారులు గుర్తించి పెద్దపాడులోని దామోదరం సంజీవయ్య బాల సదనంలో వసతి కల్పించారు.



భావి భారత పౌరుల బంగారు జీవితం రోడ్డున పడి కరిగిపోతోంది. పేదరికం, కుటుంబ పరిస్థితులు, నిరక్షరాస్యత బాల్యాన్ని ఛిదిమేస్తున్నాయి. చదువు, ఆటలతో ఆనంద జీవితాన్ని గడపాల్సిన పిల్లలు వీధిన పడుతున్నారు. కొందరు తల్లిదండ్రులు వ్యసనాలకు బానిసై తమ పిల్లలను భిక్షాటనకు పంపుతున్నారు. ప్రధాన కూడళ్లు.. దేవాలయాలు.. బస్టాండ్లు, రైల్వే స్టేషన్ల వద్ద చిన్నారులు చిల్లర కోసం చేతులు చాస్తున్నారు. హోటళ్లు, దుకాణాల్లో ఇప్పటికీ బాల కార్మికులుగా పని చేస్తూనే ఉన్నారు.

- తల్లిదండ్రులు వ్యసనాలకు బానిసలై చిన్నారులు భిక్షాటనకు
- ప్రధాన కూడళ్లలో చేతులు చాపుతున్న బాల్యం
- కొందరు అనాథలై రోడ్లపై జీవనం
- తూతూమంత్రంగా అధికారుల చర్యలు

కర్నూలు(అర్బన్)/నంద్యాల (అర్బన్): పలకా, బలపం పట్టాల్సిన చేతులు దీనంగా చిల్లర కోసం చేతులు చాస్తున్నాయి. తల్లిదండ్రులు లేని అనాథలు, తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరు లేక పోవడం, ఉన్న వారికి కూడా చిన్నారుల పోషణ భారం కావడం, వ్యసనాలకు బానిసలైన తల్లిదండ్రులు తమ పిల్లలను భిక్షాటన చేసుకురమ్మని రోడ్లపైకి వదిలేస్తున్నారు. ఇలా ... రకరకాల కారణాలతో జిల్లాలో అనేక మంది చిన్నారులు అభం శుభం తెలియని వయస్సులో బిచ్చమెత్తుకుంటున్నారు. వీరితో పాటు పలువురు మహిళలు నెలల పసికందులను చంకన పెట్టుకొని యాచిస్తున్నారు. కర్నూలు నగరం, నంద్యాల పట్టణంలోని ప్రధాన రోడ్లు, రద్దీగా ఉన్న ప్రాంతాల్లో వీరు అధికంగా కనిపిస్తున్నారు. వీరిని ఈ వృత్తి నుంచి బయటకు తీసుకువచ్చి మంచి విద్యాబుద్ధులు చెప్పించాల్సిన బాధ్యత ఉన్న అధికారుల ప్రయత్నాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. పేదరికం, నిరక్షరాస్యత, చెడు వ్యసనాల కారణంగా కుటుంబ సభ్యులే తమ చిన్నారుల బాల్యాన్ని ఛిదిమేస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి నవంబర్ వరకు బాల కార్మికులు, రన్‌వే, మిస్సింగ్, అనాథలు, స్కూల్ డ్రాపౌట్, బెగ్గింగ్ తదితర కారణాలతో 59 మంది చిన్నారులను గుర్తించినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఇందులో తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి 11 మందిని వారి ఇళ్లకు పంపించారు. మిగిలిన వారిలో నలుగురిని వైఎస్సార్ జిల్లా కడప చిల్డ్రన్స్ హోంకు పంపారు. అలాగే ఆరుగురిని తమ సొంత ప్రాంతమైన కోల్‌కతాకు పంపగా, నలుగురిని కేజీబీవీల్లో ప్రవేశం కల్పించారు. మిగిలిన వారిలో పలువురికి తిరుపతి, పత్తికొండ, పెద్దపాడులోని చిల్డ్రన్స్ హోమ్స్‌లో షెల్టర్ ఇచ్చారు.



చంటి బిడ్డతో భిక్షాటన చేస్తున్న మహిళను విచారిస్తున్న అధికారులు

దాడులు చేస్తున్నా ఫలితాలు అరకొరనే..

ఎస్‌సీఎల్‌పీ, డీసీపీయూ, హెల్త్, ఎస్ఎస్ఏ, డీఈఓ, ఇండస్ట్రీస్ తదితర ప్రభుత్వ శాఖలతో పాటు ఎన్‌జీఓ ఆర్గనైజేషన్లు చిన్నారుల సంరక్షణ కోసం దాడులు చేస్తున్నా ఫలితాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. దాడుల్లో దొరికిన చిన్నారుల ద్వారా తల్లిదండ్రుల వివరాలు తెలుసుకొని వారి ఆమోదం లేకుండా చిన్నారులను శిశు గృహాలకు తీసుకువెళ్లేందుకు వీలులేని పరిస్థితుల్లో కౌన్సెలింగ్ ఇచ్చి తిరిగి ఆ చిన్నారులను వారికి అప్పగిస్తున్నారు. దాడులు జరుగుతున్న సమయాల్లో మినహా మిగిలిన రోజుల్లో తిరిగి చిన్నారులు రోడ్లపై భిక్షాటన చేస్తూనే ఉన్నారు. కాగా... కర్నూలుకు సమీపంలోని తెలంగాణ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు చంటి బిడ్డలను తీసుకు వచ్చి నగరంలో యాచిస్తున్నారు. ఉదయం హైదరాబాద్ నుంచి కర్నూలుకు రైల్లో వచ్చే వీరు మధ్యాహ్నం వరకు భిక్షాటన చేసుకొని తిరిగి వెళ్తున్నారు. వీరే కాక ... గుజరాత్, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి బతుకుదెరువు కోసం చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేందుకు ఇక్కడకు వచ్చిన పురుషులు, మహిళలు ప్రధాన కూడళ్లలో పెన్నులు, పెన్సిళ్లు, నాలుగు చక్రాల వాహనాలకు బ్లాక్ విండ్ సీల్స్, పిల్లలు ఆడుకునే వివిధ రకాల బొమ్మలు తదితర వాటిని విక్రయిస్తుంటే, వీరి పిల్లలు భిక్షాటన చేస్తున్నారు.

జరిమానాలు అధికంగా ఉన్నా ....

వ్యాపార సంస్థలు, దుకాణాలు, హోటళ్లు తదితర వాటిల్లో 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న చిన్నారులను పనిలో పెట్టుకుంటే రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు జరిమానాలు విధిస్తున్నా, అనేక సంస్థల్లో బాల కార్మికులు పని చేస్తూనే ఉన్నారు. పైగా తమ వద్ద బాల కార్మికులు లేరనే ఫ్లెక్సీలను పెడుతున్నారు.

“ పిల్లలను పనుల్లో పెట్టుకుంటే చర్యలు



పిల్లలను పనుల్లో పెట్టుకుంటే సదరు వ్యాపారులపై చర్యలు తప్పవు. జిల్లాలో బాల కార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఎప్పటికప్పుడు బాల కార్మికులను గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్‌లను నిర్వహిస్తున్నాం. డాబాలు, రెస్టారెంట్లు, మెకానిక్ షెడ్లు ఇలా ఏదైనా వాటిల్లో చిన్నారులను పనుల్లో పెట్టుకున్నట్లు రుజువైతే రూ. 50వేలు జరిమానాతో పాటు రెండేళ్ల జైలు శిక్ష పడుతుంది. గుర్తించిన పిల్లలను స్కూల్‌కు పంపించే ఏర్పాట్లు చేస్తున్నాం. బాలలను పనిలో పెట్టుకోవడం నేరమన్న విషయంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– బషీరున్నిషాబేగం, జిల్లా డిప్యూటీ కమిషనర్, నంద్యాల

చిన్నారుల భవిష్యత్తుకు బాటలు వేయాలి



పాలక ప్రభుత్వాలు రోడ్లపై భిక్షాటన చేస్తున్న బాలలను గుర్తించి వారికి పునరావాలను కల్పించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలి. అధికారులు కూడా వారి విధులు సక్రమంగా నిర్వర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. పిల్లలను అడుక్కునేందుకు ప్రోత్సహిస్తే బాలల న్యాయ మండలి చట్టం ప్రకారం శిక్షార్హులు అవుతారు. అలాంటి వారిపైన చట్టపరంగా చర్యలు తీసుకోవాలి.

– బత్తుల చిన్నయ్య, మెంబర్, ఏపీ ప్రొవైల్డ్ గ్రూప్ నెట్‌వర్క్ కమిటీ

సామాజిక దురాచారంగా మారుతుంది



చిన్నారుల భిక్షాటన ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో ఇది చాలా పెద్ద సామాజిక దురాచారంగా మారుతుంది. ఎవరైనా పిల్లలతో భిక్షాటన చేయిస్తే భారతీయ న్యాయ సంహిత - 2023 ప్రకారం 5 ఏళ్ల జైలు శిక్ష, అధిక మొత్తంలో జరిమానా విధించవచ్చు. ఈ చట్టాలపై అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఎవరైనా సరే14ఏళ్లలోపు చిన్నారులను పనుల్లో పెట్టుకోవడం నేరం. యజమానులు అందుకు శిక్షార్హులు. దీనిపై స్వచ్ఛంద సంస్థలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.

– ప్రతాపరెడ్డి, న్యాయవాది, నంద్యాల

అనుబంధ విభాగాల అధ్యక్షులను ప్రతిపాదించండి



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డికి దరఖాస్తులు అందజేస్తున్న పార్టీ రాష్ట్ర సమన్వయ కర్తలు

కర్నూలు (టౌన్): వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అనుబంధ విభాగాలకు జిల్లా, రాష్ట్ర స్థాయి అధ్యక్షుల నియామకాలకు ప్రతిపాదనలు పంపించాలని ఆ పార్టీ రాష్ట్ర సమన్వయ కర్తలు ఘంటా నరహరి, సాకే చంద్ర శేఖర్, భవనం రామచంద్రారెడ్డి కోరారు. శనివారం పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డిని వారు వేర్వేరుగా కలిసి కమిటీ నియామకాలకు సంబంధించిన దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విభాగానికి ముగ్గురు వ్యక్తుల పేర్లు ప్రతిపాదించాలన్నారు. అనుబంధ విభాగాల బలోపేతానికి పార్టీ చర్యలు చేపట్టిందన్నారు. జిల్లా పరిధిలో అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తల సహకారంతో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి అనుబంధ విభాగాల అధ్యక్షులను ప్రతిపాదించాలని చెప్పారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ ఇప్పటికే కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందన్నారు.

లోక కల్యాణం కాంక్షిస్తూ..



వీరభద్రస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: లోక క్షేమాన్ని కాంక్షిస్తూ శ్రీశైలక్షేత్ర పాలకుడిగా ప్రసిద్ధి గాంచిన బయలువీరభద్ర స్వామికి శనివారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీశైల దేవస్థానం అధికారులు, అర్చకులు ప్రదోషకాల సమయంలో వీరభద్ర స్వామికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలు నిర్వహించి సంకల్పం పఠించారు. అనంతరం గణపతి పూజ చేసి క్షేత్రపాలకుడికి ప్రత్యేక నైవేద్యం సమర్పించారు.

యూపీ వారియర్స్‌లో అంజలి స్థానం పదిలం



అంజలి శర్వాణి మహిళా క్రికెటర్

ఆదోని సెంట్రల్: పట్టణానికి చెందిన టీమ్ ఇండియా ఉమెన్ క్రికెటర్ అంజలి శర్వాణీని ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో యూపీ వారియర్స్ జట్టులో స్థానాన్ని పదిలం చేసుకుంది. గతేడాది జరిగిన వేలంలో యూపీ వారియర్స్ అంజలిని రూ. 55 లక్షలకు కొనుగోలు చేసి జట్టులో చేర్చుకుంది. కాగా.. వచ్చే సీజన్ కోసం డిసెంబర్ 15న మినీ వేలం జరగనుండగా.. ఆయా ఫ్రాంచైజ్‌లు పలువురు ప్లేయర్లను ఇప్పటికే వదులుకునేందుకు సిద్ధమయ్యాయి. అయితే అంజలిని మాత్రం యూపీ వారియర్స్ ఫ్రాంచైజ్ ముందుగానే తమ జట్టు క్రీడాకారిణిగా ప్రకటించింది. 2012లో క్రికెట్‌లోకి ఎంట్రీ ఇచ్చిన అంజలి తన అద్భుతమైన బౌలింగ్‌తో క్రీడాభిమానులను ఆకట్టుకున్నారు. యూపీ వారియర్స్ అంజలిని రిటైన్ చేసుకోవడం పట్ల సంతోషంగా ఉందని తండ్రి రమణారావు, కుటుంబసభ్యులు, మిత్రులు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఆమెను అభినందించారు.

వణికిస్తున్న ఫెంగల్ తుపాను





భీమునిపాడు సమీపంలో నేలవాలిన వరి, కానాలలో ఆరబోసిన ధాన్యంపై పట్టా కప్పుతున్న రైతులు

- వర్షపు జల్లులతో అన్నదాత ఆందోళన

కోవెలకుంట్ల/నంద్యాల (అర్బన్): నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఫెంగల్ తుపానుగా మారి శనివారం చిన్నపాటి వర్షం కురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వివిధ పంటలు కోత, నూర్పిడి, పూత, పిందె దశల్లో ఉన్నాయి. జిల్లాలో 66,314 హెక్టార్లలో కర్నూలు, నంద్యాల సోనా రకాలకు చెందిన వరి, 42,922 హెక్టార్లలో కంది, 54,354 హెక్టార్లలో మొక్కజొన్న, 7,111 హెక్టార్లలో పత్తి పంటలు సాగయ్యాయి. వరి పంటలో రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, కలుపు, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 35 వేల వరకు పెట్టుబడులు వెచ్చించారు. ప్రస్తుతం వరి కోత, నూర్పిడి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. రెండు వారాల క్రితం కురిసిన భారీ వర్షాల కారణంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో వరి నేలవాలి, వడ్లు రాలిపోవడంతోపాటు ఆరబోసిన వడ్లు తడిచిపోయి రంగు మారి నష్టపోయారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మొక్కజొన్న పంట నూర్పిడి పనులు జరుగుతున్నాయి. దిగుబడులను కల్లాలు, పొలాలు, రోడ్లపై ఆరబోసుకున్నారు. అవి వర్షానికి తడవకుండా పట్టలు కప్పుకున్నారు. ఈ ఏడాది విస్తారంగా సాగైన కంది పంట ప్రస్తుతం పూత దశలో ఉండగా వర్షంతో పూత, పిందె రాలిపోయాయి. ఆయా పంటల్లో తిరిగి పూత వస్తున్న తరుణంలో మరలా వర్షపు జల్లులు కురుస్తుండటంతో దిగాలు చెందుతున్నారు. ఆయా పంటలకు పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 20 వేలకు పైగా వెచ్చించారు. సీడు, హైబ్రిడ్ పత్తి పూత, కాయ దశల్లో ఉండగా రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, కూలీల రూపంలో ఎకరాకు రూ. 50 వేల నుంచి రూ. 75 వేల వరకు ఖర్చు చేశారు. ఈ పరిస్థితుల్లో వరుస తుపాన్లతో దిగుబడులు చేతికందుతాయో లేదోనన్న బెంగ రైతుల్లో నెలకొంది.

ఆరో నెల.. అదే తీరు!

- ఇంటి దగ్గర పింఛన్ల పంపిణీ అరకొరనే
- అధిక శాతం సచివాలయాలు, రచ్చబండ దగ్గరే పంపిణీ



దొర్నిపాడు మండలం భాగ్యనగరంలో ఒకేచోటకే పిలిపించుకొని పింఛన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

నంద్యాల (న్యూటౌన్): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి పింఛన్లు ఇంటింటికీ అందకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. జూలై నుంచి కూడా అదే తీరు కనిపిస్తోంది. డిసెంబరు 1వ తేదీ ఆదివారం సెలవు దినం కావడంతో ఒక్కరోజు ముందుగా అంటే శనివారమే పంపిణీ కార్యక్రమం చేపట్టారు. అయితే ఈ సారి కూడా ఇంటి దగ్గర పింఛన్ల పంపిణీ నామమాత్రానికే పరిమితమైంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన సచివాలయ ఉద్యోగులు ఉదయం గంట, రెండు గంటల పాటు ఇంటి దగ్గరకే వెళ్లి పంపిణీ చేసినా.. తర్వాత సచివాలయాల్లో, రచ్చబండల దగ్గర ఒకే చోట పంపిణీ చేపట్టారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి పట్టణంలోని బొమ్మలసత్రం సమీపంలో, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి కానాల గ్రామంలో పింఛన్లు పంపిణీ చేశారు. అయితే అధికారులు వెళ్లి పోయిన తర్వాత యథావిధిగా సచివాలయాల్లోనే పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. నంద్యాల జిల్లాలో 2,16,606 పింఛన్లు ఉండగా సాయంత్రం 6 గంటల సమయానికి 2,06,836 (95.49 శాతం) మందికి పంపిణీ చేశారు. వివిధ కారణాలతో మిగిలిపోయిన వారికి మాత్రం 2వ తేదీ సోమవారం పంపిణీ చేస్తారు.

పకడ్బందీగా సాగునీటి సంఘాల ఎన్నికలు

- అధికారులకు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల నిర్వహణపై ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పటిష్ట ప్రణాళిక రూపొందించుకొని ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలన్నారు. ఈనెల 5న సాగునీటి సంఘాల ఎన్నికల ప్రకటన, 8వ తేది ఎన్నికల నిర్వహణ ఉంటుందన్నారు. కేసీ కాల్వ కింద 52, ఎస్సార్బీసీ కింద 50, తెలుగు గంగ కింద 47, శివ భాష్యం ప్రాజెక్ట్ కింద 7, మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల కింద 104, మైలవరం కింద ఒకటి వెరిసి మొత్తం 261 నీటి వినియోగదారుల సంఘాలున్నాయన్నారు. ఇందుకు సంబంధించిన ఓటర్ల జాబితా తహసీల్దార్ల నుంచి తీసుకోవాలన్నారు. ఓటింగ్ నిర్వహించే ప్రదేశం రైతులందరికీ తెలిసేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు. నామినేషన్ వేసిన వ్యక్తిని ఎన్నుకోవడానికి రైతులు చేతులెత్తి తమ ఆమోదం తెలపాలన్నారు. 11వ తేదీన డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 14వ తేదీన ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు జరుగుతాయన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్‌ఓ రామునాయక్, ఆర్డీఓలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఇరిగేషన్ శాఖ ఎస్ఈ సుబ్బారాయుడు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఎంఈఓలు తదితర అధికారులు పాల్గొన్నారు.



భక్తులతో కిక్కిరిసిన మద్దిలేటి నరసింహస్వామి ఆలయం

భక్త జన సందడి

మండలపరిధిలోని ఆర్ఎస్ రంగాపురం శివారులోని మద్దిలేటి లక్ష్మీ నరసింహస్వామి ఆలయం దీపకాంతులతో వెలిగిపోయింది. కార్తీక మాసం కడ శనివారాన్ని పురస్కరించుకుని జిల్లా నలుమూలలనుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లకు అభిషేకం, కుంకుమార్చన, స్వామి వారికి ప్రీతి పాత్రమైన వరపూజ నిర్వహించారు. వేకువ జాము నుంచే మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. గణ మద్దిలేటయ్యకు ఘనంగా డప్పు వాయిద్యాలు, మంగళవాయిద్యాలతో మొక్కులు చెల్లించారు. ఆలయ ఈఓ రామాంజనేయులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు. – బేతంచెర్ల



ప్రత్యేక అలంకరణలో స్వామి

క్లుప్తంగా

మల్లన్న సన్నిధిలో సినీ నటుడు రాజేంద్రప్రసాద్



సినీ నటుడు రాజేంద్రప్రసాద్‌ను సత్కరిస్తున్న ఏఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను శనివారం సినీ నటుడు రాజేంద్రప్రసాద్ దర్శించుకున్నారు. అనంతరం అన్నప్రసాద వితరణకు రూ.1,00,200 విరాళాన్ని ఆలయ పర్యవేక్షకులు జి.స్వాములుకు అందజేశారు. ఆయనకు స్వామివారి శేషవస్త్రాన్ని, లడ్డూ ప్రసాదాలను, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

ప్రసవం సమయంలో తల్లీ, బిడ్డ మృతి

పత్తికొండ(తుగ్గలి): ప్రసవ సమయంలో తల్లీ, బిడ్డ మృతిచెందిన ఘటన శనివారం పత్తికొండలో చోటు చేసుకుంది. పత్తికొండ పట్టణంలోని బుడగ జంగాల కాలనీకి చెందిన మౌనిక(20) తొలిసారి గర్భం దాల్చింది. నెలలు నిండడంతో ప్రసవం కోసం భర్త మహేష్ స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. సాధారణ ప్రసవం కోసం ప్రయత్నించారు. ఈక్రమంలో ఆమెకు ఫిట్స్ వచ్చి కడుపులోనే మగ బిడ్డ మృతిచెందింది. డాక్టర్లు మృత శిశువును బయటకు తీసి తల్లిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు. ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే మౌనిక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వివాహిత అదృశ్యం

పగిడ్యాల: మండలంలోని పాతముచ్చుమర్రి గ్రామానికి చెందిన చిట్టి అదృశ్యమైనట్లు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన బోయ కృష్ణ భార్య చిట్టి వారం క్రితం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లేకపోవడంతో భర్త కృష్ణ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏబీఎం పాలెంలో బాలిక..

నందికొట్కూరు: పట్టణంలోని ఏబీఎం పాలెంకు చెందిన మౌనిక(17) అదృశ్యమైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ సురేష్‌బాబు తెలిపిన వివరాలు.. బాలిక శనివారం ఉదయం రాములవీధిలో కుటుమిషన్ నేర్చుకోవడానికి వెళ్లింది. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో బాలిక తండ్రి పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మరోసారి మొసలి కలకలం

- వారం రోజులుగా నూతనపల్లె, పి.రుద్రవరం గ్రామాల పరిసరాల్లో సంచారం
- ఆందోళన చెందుతున్న ప్రజలు



పసుపల వాగు సమీపంలో మొసలి

కర్నూలు (రూరల్): మండల పరిధిలోని పసుపల గ్రామ సమీపంలో ఉన్న వాగు వద్ద శనివారం తెల్లవారుజామున మొసలి కనిపించింది. కొంత దూరంలోనే దర్గాలో ఉన్న ఓ వ్యక్తి వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టడంతో వైరల్ అయ్యింది. కాగా వారం రోజులుగా నూతనపల్లె, పి.రుద్రవరం గ్రామాల పరిసరాల్లో మొసలి సంచరిస్తున్నట్లు సామాజిక మాధ్యమాల్లో వార్తలు వస్తున్నా సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రహదారి పనులు జరుగుతుండటంతో వందల మంది కూలీలతోపాటు సమీప పొలాల రైతులు, పశువుల కాపరులు రాకపోకలు సాగిస్తున్నారు. ఎలాంటి ప్రమాదం జరగకముందే అటవీ శాఖ అధికారులు స్పందించి మొసలిని పట్టుకుని దూరంగా తరలించాలని పలువురు కోరుతున్నారు.

నిశ్శబ్దాన్ని ఛేదించారు..!

- జిల్లాలో తగ్గుతున్న ఎయిడ్స్ బాధితుల సంఖ్య
- గత ఐదేళ్లలో గణనీయమైన ప్రగతి
- విస్తృతంగా అవగాహన కలిగివుండటమే కారణం
- నేడు ప్రపంచ ఎయిడ్స్ అవగాహన దినం

కర్నూలు(హాస్పిటల్): ఎయిడ్స్ అంటే ఎవరికి భయముండదు. ఈ వ్యాధి ఒక్కసారి వచ్చిందంటే చాలు శరీరాన్ని వదిలివెళ్లదు. మందులు వాడితే నియంత్రణలో ఉంటుంది గానీ ఆదమరిస్తే మాత్రం తిరగబెట్టి కబళించేస్తుంది. ఈ నేపథ్యంలో ఈ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెరిగి క్రమబద్ధమైన జీవితాన్ని అలవాటుచేసింది. ఫలితంగా జిల్లాలో కొన్నేళ్లుగా ఎయిడ్స్ తగ్గుముఖం పడుతూ వస్తోంది. డిసెంబర్ 1న ప్రపంచ ఎయిడ్స్ అవగాహన దినం సందర్భంగా ప్రత్యేక కథనం.

ప్రపంచ ఎయిడ్స్ దినంగా మొదటి సారి 1988లో పాటించారు. అప్పటి నుంచి ఏటా డిసెంబర్ 1న ఈ దినాన్ని నిర్వహిస్తున్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినం హెచ్ఐవీ/ఎయిడ్స్ పట్ల అవగాహన కల్పించడం కోసం, ప్రపంచ వ్యాప్తంగా దీనిని ఎదుర్కొనేందుకు అందరినీ దగ్గర చేసే ఒక కార్యక్రమం. ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు ఈ వ్యాధితో పోరాడిన వారి జ్ఞాపకాలను స్మరించుకుంటూ హెచ్ఐవీ పట్ల ప్రపంచం ప్రతిస్పందనగా సాధించిన ప్రగతిని జరుపుకునే కార్యక్రమాలకు, సంఘటనలకు ఈ రోజు అంకితం చేస్తారు. జిల్లాలో ఏడు సమగ్ర సలహా, పరీక్షా కేంద్రాలు(ఐసీటీసీలు), 87 ఫెసిలిటీ ఇంటిగ్రేటెడ్ ఐసీటీసీలు, మూడు సుఖవ్యాధుల చికిత్సా కేంద్రాలు, ఒక ఏఆర్‌టీ ప్లస్ కేంద్రం(జీజీహెచ్, కర్నూలు), ఒక ఏఆర్‌టీ కేంద్రం(ఏరియా ఆసుపత్రి, ఆదోని), మూడు లింక్ ఏఆర్‌టీ కేంద్రాలు, 14 రక్తనిధి కేంద్రాలు(ప్రభుత్వ, ప్రైవేటు), ఏడు రక్తనిల్వ కేంద్రాలు, ఐదు ప్రివెన్షన్ యూనిట్లు(టార్గెటెడ్ ఇంటర్‌వెన్షన్ ప్రాజెక్టు), ఒక లింక్ వర్కర్ ప్రాజెక్టు(చైల్డ్ ఫండ్ ఇండియా–48 గ్రామాల్లో), ఒక నేస్తం పాజిటివ్ నెట్‌వర్క్ ఉన్నాయి. జిల్లాలో ప్రస్తుతం హెచ్ఐవీతో 7,168 మంది జీవిస్తున్నారు.

2011 నుంచి ఎయిడ్స్ బాధితుల వివరాలు

సంవత్సరం	సాధారణ ప్రజలు హెచ్ఐవీ పరీక్షలు	సాధారణ ప్రజలు హెచ్ఐవీ బాధితులు	గర్భిణులు హెచ్ఐవీ బాధితులు	గర్భిణులు హెచ్ఐవీ పరీక్షలు
2011-12	59,982	2,920	40653	167
2012-13	66,293	2,526	62,837	152
2013-14	58,217	1,868	48,292	113
2014-15	64,832	1,810	52,012	84
2015-16	80,613	1,892	66,063	130
2016-17	61,739	1,224	61.723	83
2017-18	78,484	1,249	62,498	67
2018-19	88,156	1,383	72,607	69
2019-20	1,04,492	1,223	97,230	54
2020-21	56,169	576	86,309	47
2021-22	87,865	885	1,02,170	54
2022-23	68,182	20	83,596	36
2023-24	81,882	477	80,122	18
2024-24 అక్టోబర్ వరకు	62,107	291	31,512	15

న్యాకో హెచ్ఐవీ సెంటినెల్ సర్వైలెన్స్ సర్వే ప్రకారం జిల్లాలో 2002లో 0.50శాతం ఉన్న హెచ్ఐవీ వ్యాప్తి 2024 నాటికి 0.47 శాతంగా ఉంది.

తగ్గుతున్న హెచ్ఐవీ బాధితులు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసీ విభాగం నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలతో జిల్లాలో హెచ్ఐవీ బాధితుల సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. 2012లో సాధారణ ప్రజలు 59,982 మందికి పరీక్షలు చేయగా 2,920 మందికి హెచ్ఐవీ నిర్ధారణ కాగా ఈ ఏడాది అక్టోబర్ వరకు 62,107 మందికి పరీక్షలు చేయగా 291 మందికి హెచ్ఐవీ నిర్ధారణ అయ్యింది. గర్భిణుల్లో 2012లో



40,653 మందికి పరీక్షలు చేయగా 167 మందికి పాజిటివ్ రాగా, ఈ యేడాది అక్టోబర్ వరకు 31,512 మందికి పరీక్షలు చేయగా కేవలం 15 మందికి మాత్రమే హెచ్ఐవీ ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. ప్రస్తుతం ఏఆర్‌టీ కేంద్రాల్లో చికిత్స కోసం నమోదు చేసుకున్న వారి సంఖ్య 18,843 కాగా అక్కడ మందులు వాడే వారి సంఖ్య 7,485 మంది, ఏఆర్‌టీ ప్లస్ కేంద్రంలో రెండవ రకం మందులు వాడే వారి సంఖ్య 669 మంది ఉన్నారు.

ఇతర ప్రభుత్వ విభాగాల సహకారంతో..

- మహిళా, శిశు సంక్షేమ శాఖ ద్వారా జిల్లాలో మిషన్ వాత్సల్య పథకం కింద లబ్ధిపొందిన హెచ్ఐవీతో జీవిస్తున్న/ప్రభావిత చిన్నారులు 42 మంది.
- ఉన్నత విద్యాశాఖ ద్వారా ఎన్ఎస్ఎస్/ఎన్‌సీసీ విభాగాల సహకారంతో విద్యార్థులలో హెచ్ఐవీ/ఎయిడ్స్ పట్ల, రక్తదానంపై అవగాహన కల్పించేందుకు అన్ని డిగ్రీ కళాశాలల్లో రెడ్‌రిబ్బన్ క్లబ్బులు ఏర్పాటు చేశారు.
- ఉన్నత విద్యాశాఖ, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సహకారంతో విద్యార్థులలో హెచ్ఐవీ/ఎయిడ్స్ పట్ల అవగాహన కల్పించేందుకు మారథాన్ పరుగు పందెం, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు ప్రదానం చేశారు.
- ఇంటెన్సిఫైడ్ హెచ్ఐవీ ప్రచార కార్యక్రమంలో భాగంగా నాలుగు నెలల పాటు కళాశాల విద్యార్థులు, యువత, హెచ్ఐవీ సోకే ప్రమాదమున్న 15 వేల మందికి అవగాహన కల్పించారు.
- పోలీస్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో జిల్లాలో 102 స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు నిర్వహించి జిల్లా లో 31,035 యూనిట్ల రక్తాన్ని సేకరించడం ద్వారా రక్తం కొరత లేకుండా సురక్షిత రక్తమార్పిడి ద్వారా హెచ్ఐవీ వ్యాప్తిని అరికట్టేందుకు దోహదం చేశారు.

జిల్లాకు రెండు స్టేట్ అవార్డులు



వరల్డ్ ఎయిడ్స్ డేను పురస్కరించుకుని జిల్లాకు రెండు స్టేట్ అవార్డులు వచ్చాయి. ఇందులో తల్లి నుంచి బిడ్డకు హెచ్ఐవీ వ్యాప్తిని అరికట్టడంలో బాగా పనిచేసినందుకు, సెకండ్ రెఫరెన్స్ ల్యాబోరేటరీ ద్వారా వైరల్ లోడ్ టెస్టింగ్ చేసిందుకుగాను అవార్డులు దక్కాయి. ఎయిడ్స్ డే రోజున(డిసెంబర్ 1) జిల్లా పరిపాలన, ఇతర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థుల భాగస్వామ్యంతో కలెక్టరేట్ నుంచి రాజవిహార్ వరకు భారీ ర్యాలీ, మానవహారం, ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించనున్నాం.

– డాక్టర్ ఎల్. భాస్కర్, డీఎంహెచ్ఓ, కర్నూలు

డ్రైవర్ నిర్లక్ష్యం.. క్లీనర్ దుర్మరణం

- క్లీనర్ బస్సు కింద దూరి బోల్ట్ చెక్ చేస్తుండగా ముందుకు కదిలించిన డ్రైవర్



మృతుడు గణపతి(ఫైల్)

కోవెలకుంట్ల: ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం.. క్లీనర్ ప్రాణాలు బలి తీసుకుంది. ఈ విషాద ఘటన శనివారం కోవెలకుంట్ల ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాలు.. పట్టణంలోని రంగరాజుపేటలో నివాసం ఉంటున్న చిన్న వెంకటరమణారావు అలియాస్ గణపతి(45) కొన్నేళ్ల నుంచి స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లోని అద్దె బస్సుల క్లీనర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శనివారం తెల్లవారుజామున ఆళ్లగడ్డకు వెళ్లే అద్దె బస్సు కండీషన్‌ను పరిశీలించే క్రమంలో అవుకు మండలం కాశీపురానికి చెందిన డ్రైవర్ అశోక్ అక్కడకు చేరుకుని ఎయిర్‌బ్రేక్ బోల్ట్‌లను సరిచేయాలని, తాను గ్యారేజీ వద్దకు వెళ్లి సంతకం చేసి వస్తానని చెప్పి వెళ్లాడు. గణపతి బస్సు కిందకు దూరి బోల్ట్‌లు సరిచేస్తుండగా డ్రైవర్ కాసేపటికే వచ్చి స్టార్ట్ చేసి బస్సును ముందుకు కదిలిచ్చాడు. బస్సు కింద ఉన్న గణపతి తలపై వెనుక టైర్లు ఎక్కడంతో తల నుజ్జునుజ్జై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటనను చీకట్లో ఎవరూ గమనించలేక పోయారు. డ్రైవర్ మాత్రం ఆళ్లగడ్డ ప్లాట్‌ఫాంపై బస్సును నిలిపి ప్రయాణికులు ఎక్కగానే వెళ్లిపోయాడు. తెల్లవారిన తరువాత ఆర్టీసీ సిబ్బంది గణపతి మృతదేహాన్ని గుర్తించి డ్రైవర్‌కు సమాచారం ఇచ్చారు. అతడు బస్సును వెనక్కు తీసుకొచ్చి పోలీస్‌స్టేషన్ వద్ద ఆపి పోలీసులకు లొంగిపోయాడు. ఎస్‌ఐ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి శవపరీక్ష నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య రాజేశ్వరి, కుమారులు ప్రణీత్‌రావు, ఉమేస్‌రావు ఉన్నారు.

అంత్యక్రియలకు వెళ్తూ అనంతలోకాలకు

- స్కూటీపై నుంచి కింద పడి వ్యక్తి మృతి



మృతి చెందిన యూసుఫ్

గోనెగండ్ల: సమీప బంధువు అంత్యక్రియలకు హాజరయ్యేందుకు వెళ్తూ ఓ వ్యక్తి అనంత లోకాలకు చేరుకున్నాడు. సీఐ గంగాధర్ తెలిపిన వివరాలు.. శనివారం ఉదయం ప్యాలకుర్తి గ్రామానికి చెందిన యూసుఫ్ (52) తన సమీప బంధువు అంత్యక్రియల కోసమని స్కూటీపై ఎమ్మిగనూరుకు బయలుదేరాడు. గోనెగండ్ల మండలం వేముగోడు గ్రామ సమీపంలోకి రాగానే బీపీ డౌన్ అయి స్కూటీపై నుంచి కింద పడ్డాడు. తలకు తీవ్రగాయమై రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు.. అక్కడి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య జిలానీబేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కారు ఢీకొని..



మృతి చెందిన పెద్ద రంగస్వామి

నందవరం: మండల పరిధిలోని ముగతి గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మంత్రాలయం మండలం సుంకేశ్వరి గ్రామానికి చెందిన జంగం పెద్ద రంగస్వామి(25) దుర్మరణం చెందాడు. ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలు.. రంగస్వామి తన స్వగ్రామంలో హోటల్ నిర్వహిస్తుండేవాడు. శనివారం హోటల్‌కు కావలసిన సరుకుల కోసమని ఎమ్మిగనూరుకు వెళ్లాడు. సరుకులు తీసుకుని ఆటోలో పంపి వెనక నుంచి బైక్‌పై బయలుదేరారు. మార్గమధ్యలో ముగతి సర్కిల్ దాటిన తరువాత మంత్రాలయం నుంచి బెంగళూరుకు వెళ్తున్న కారు వేంగా బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో రంగస్వామి తలకు, బీజాలకు తీవ్ర రక్త గాయాలయ్యాయి. అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డీఎస్పీ ఉపేంద్రబాబు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నలుగురిపై వరకట్న వేధింపుల కేసు

నందికొట్కూరు: వివాహితను వరకట్నం కోసం వేధిస్తున్న కేసులో ఆమె భర్త, మామ, అత్త, మరిదిపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాలు.. పట్టణంలోని సంగయ్యపేటకు చెందిన సమీరాభానును హాజీనగర్‌కు చెందిన అల్లీంబాషాకు ఇచ్చి రెండేళ్ల క్రితం వివాహం చేశారు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. ప్రస్తుతం ఆమె గర్భిణి. కాగా భర్త అల్లీంబాషా, మామ నన్నెసాహెబ్, అత్త మాబూన్నీ, మరిది సమీర్ అదనపు కట్నం కోసం తనను వేధిస్తున్నారని సమీరాభాను ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేసి,దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

అన్నదమ్ముల మధ్య చిచ్చురేపడమే ఎస్సీ వర్గీకరణ

- మాలల ఆత్మీయ సమ్మేళనంలో మాజీ ఎంపీ హర్షకుమార్

ఆదోని రూరల్: అన్నదమ్ముల మధ్య చిచ్చు రేపడమే ఎస్సీ వర్గీకరణ అని మాజీ ఎంపీ హర్షకుమార్ అన్నారు. శనివారం స్థానిక ఓ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన మాలల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న 86 లక్షలకు పైగా ఉన్న మాలలంతా ఏకతాటిపైకి వచ్చి ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. తమ రాజకీయ పబ్బం గడుపుకునేందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు కల్లుపోతుల సురేష్, రాష్ట్ర నాయకులు పండు అశోక్‌కుమార్, మంగారాజు, పంతగాని సురేష్, అంబటి కొండలరావు, ఆదోని పట్టణ అధ్యక్షులు బొబ్బిలి పాల్గొన్నారు.



మాజీ ఎంపీ హర్షకుమార్‌ను సన్మానిస్తున్న మాలమహానాడు నాయకులు

కారు బోల్తా

- ఇద్దరికి స్వల్ప గాయాలు

మహానంది: నంద్యాల–గిద్దలూరు నల్లమల ఘాట్‌రోడ్డులో శనివారం కారు బోల్తా పడింది. కర్నూలుకు చెందిన కొందరు కారులో కర్నూలు నుంచి గిద్దలూరుకు బయలుదేరారు. పచ్చర్ల సమీపంలోని మూల మలుపు వద్ద అదుపు తప్పి కారు బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న ఇద్దరికి స్వల్పగాయాలైనట్లు పోలీసులు తెలిపారు. కాగా పోలీసులు అక్కడికి చేరుకునేలోపే బాధితులు ఇతర వాహనంలో వెళ్లిపోయారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.

టేబుల్ టెన్నిస్ రాష్ట్రస్థాయి పోటీలు ప్రారంభం



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక పద్మావతినగర్‌లోని ఇండోర్ స్టేడియంలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–14 బాలబాలికల టేబుల్ టెన్నిస్ రాష్ట్రస్థాయి పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శ్రీనాథ్, ఎంఈఓ శివరామప్రసాద్, ఫిజికల్ ఎడ్యుకేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏపీ రెడ్డి, జిల్లా ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దండె నాగరాజు, టేబుల్ టెన్నిస్ కోచ్‌లు ముంతాజ్ పాల్గొన్నారు.

అర్చకుడిపై వేటు

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయ అర్చకుడు లోక్‌రాజును శనివారం ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు సస్పెండ్ చేశారు. అర్చకుడు లోక్‌రాజు ఆలయంలో పూజలు చేస్తుండగా భక్తులు హారతిలో సమర్పించిన డబ్బును హుండీలో వేయకుండా పక్కన ఉంచుకున్నాడు. గమనించిన ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, పర్యవేక్షకుడు మల్లికార్జున డబ్బు హుండీలో వేయాలని కోరినా వినకుండా దూషణకు దిగాడు. వారి ఫిర్యాదు మేరకు లోక్‌రాజును సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడని లోక్‌రాజ్‌పై గత నెలలో పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

భారీగా సీఐల బదిలీలు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో స్థానచలనం కలిగిన సీఐలు

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
బి.వి.విక్రమ సింహా	ఎమ్మిగనూరు సర్కిల్	వీఆర్, కర్నూలు
బి.వి.మధుసూదన్‌రావు	సీసీఎస్1, కర్నూలు	ఎమ్మిగనూరు రూరల్ సర్కిల్
కె.శ్రీనివాసనాయక్	వీఆర్, కర్నూలు	సీసీఎస్1, కర్నూలు
ఎస్.అస్రార్ బాషా	నంద్యాల తాలూకా	యూపీఎస్ ఎస్‌బీ2, నంద్యాల
ఆర్.ఈశ్వరయ్య	డీటీసీ, నంద్యాల	నంద్యాల తాలూకా యూపీఎస్
ఎ.చాన్ బాషా	వీఆర్, అన్నమయ్య	డీటీసీ, నంద్యాల
డి.రాము	వీఆర్, నంద్యాల	ఆత్మకూరు, యూపీఎస్
కె.మోహన్‌రెడ్డి	పీసీఆర్, నంద్యాల	ఎస్‌బీ1, నంద్యాల
బి.ఆర్.కృష్ణయ్య	వీఆర్, నంద్యాల	పీసీఆర్, నంద్యాల
జి.ఓబులేసు	ఆత్మకూరు యూపీఎస్	చిన్నచౌకు యూపీఎస్

- సీమ రేంజ్‌లో 26 మంది, ఉమ్మడి జిల్లాలో 10 మందికి స్థానచలనం

కర్నూలు: పోలీసు శాఖలో భారీగా సీఐల బదిలీలు జరిగాయి. రాయలసీమ రేంజ్ పరిధిలోని కర్నూలు, నంద్యాల, వైఎస్సార్ కడప, అన్నమయ్య, అనంతపురం జిల్లాల్లో పనిచేస్తున్న 26 మందికి స్థానచలనం కల్పిస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా రేంజ్ పరిధిలో వీఆర్‌లో ఉన్న పది మందికి పోస్టింగులు దక్కగా స్టేషన్లలో పనిచేస్తున్న ఐదుగురిని వీఆర్‌కు పంపుతూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప దిమంది సీఐలకు స్థానచలనం కలిగింది.

గడువులోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

- రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చీఫ్ ఇంజినీరు జయరామాచారి

ఓర్వకల్లు: గత ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలను గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చీఫ్ ఇంజినీరు జయరామాచారి అన్నారు. ఓర్వకల్లు మండలం నన్నూరు, కల్లూరు మండలం పందిపాడు హౌసింగ్ లేఅవుట్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సీఈ మాట్లాడుతూ గత ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను మార్చిలోగా పూర్తయ్యేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆ తర్వాత నిర్మించిన ఇళ్లకు బిల్లులు మంజూరు కావన్నారు. కాగా గృహ నిర్మాణ సంస్థలోని అవుట్ సోర్సింగ్ వర్క్‌ఇన్‌స్పెక్టర్లకు ఎఫ్‌టీఏ, మండల ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించాలని హౌసింగ్ కార్పొరేషన్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వి.హనుమన్న సీఈకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన డీఈ కృష్ణమూర్తి, ఏఈ రామయ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్లు రామునాయక్, నాగేష్, యాసిన్, వెంకటేష్, కిరణ్, శివ, స్థానిక నాయకులు తలారి విజయుడు, షంషుద్దీన్, ఖాజామియా, ఇంద్ర తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న సీఈ జయరామాచారి